క్లుప్తంగా

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


డాక్టర్ మోనాకు వినతిపత్రమిస్తున్న 104 సిబ్బంది

అమడగూరు: అత్యవసర సమయంలో ఆస్పత్రులకు చేర్చి ప్రాణాలు కాపాడుతున్న తమ సమస్యలను పరిష్కరించాలని 104 ఉద్యోగులు బుధవారం మండల కేంద్రంలో వైద్యాధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బకాయిపడ్డ జీతాలు వెంటనే ఇవ్వాలని, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని పేర్కొన్నారు.

యూటీఎఫ్ మహాసభ పోస్టర్లు విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంఈఓలు

తనకల్లు: ఈ నెల పదో తేదీన కదిరిలో నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభలకు సంబంధించిన పోస్టర్లను బుధవారం తనకల్లు ఎమ్మార్సీలో ఎంఈఓలు లలితమ్మ, కళ్యాణి విడుదల చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ వేమల సంతోషకుమార్, మండల అధ్యక్షుడు ఖాజా మోహీద్దీన్, ప్రధాన కార్యదర్శి సుందుపల్లి గణేష్, ఉపాధ్యక్షురాలు కొలిమి గౌసియా, కార్యదర్శులు అబీద, ఫరీదాబాను, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి విద్యుత్‌షాక్


చికిత్స పొందుతున్న లక్ష్మమ్మ

ధర్మవరం అర్బన్: విద్యుదాఘాతంతో వృద్ధురాలు గాయపడింది. పట్టణంలోని సాయినగర్‌కు చెందిన ఆకుకూరల వ్యాపారం చేసే లక్ష్మమ్మ అనే వృద్ధురాలు బుధవారం రంగా సినీ కాంప్లెక్స్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మూత్రవిసర్జన చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రిలో చేర్చారు.

గణపతి హోమం

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం గణపతి హోమం నిర్వహించారు. కార్తీక మాసంలో అయ్యప్ప మాలధారణ ప్రారంభం కావడంతో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేదపండితులు మంజునాథశర్మ గణపతి హోమంతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

'సాగునీటి' ఓటర్ల జాబితా విడుదల

పుట్టపర్తి: త్వరలో జరిగే సాగునీటి సంఘం ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను బుక్కపట్నం తహసీల్దార్ షాబుద్దీన్, ఇరిగేషన్ ఏఈఈ జమునాబాయి బుధవారం విడుదల చేశారు. బుక్కపట్నం, అగ్రహారం, మారాల చెరువుల పరిధిలోని ఆయకట్టు ఓటర్ల జాబితా విడుదల చేశామని, అర్హులై ఉండి జాబితాలో పేరు లేకుంటే వారు సంబంధిత పత్రాలు సమర్పించి ఓటు హక్కు పొందాలని సూచించారు.

ఆధార్ అవస్థలు తీర్చండి

ఓడీచెరువు : మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ నాయకులు తెలిపారు. ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలని బుధవారం తహసీల్దార్ అనంతాచారికి వినతిపత్రం అందించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యదర్శి చలపతి, సహాయ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా



సురేష్‌బాబు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 8న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సురేష్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో యువతీ, యువకులకు రెండు కంపెనీల ప్రతినిధులతో ఉద్యోగ మేళా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసి.. 18 నుంచి 30 సంవత్సరాల్లోపు వయసున్న వారు జాబ్‌మేళాకు హాజరు కావొచ్చన్నారు. జీతం రూ.15వేల నుంచి రూ.25వేల వరకు ఉంటుందన్నారు.

12 నుంచి గ్రామసభలు

తనకల్లు: మండలంలోని 20 రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 12 నుంచి డిసెంబర్ 13వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శోభ సువర్ణమ్మ తెలిపారు. ఏవైనా సమస్యలుంటే ప్రజలు అర్జీల రూపంలో అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారన్నారు.

సురక్షిత ప్రయాణానికి నిరీక్షణ

- అన్ని గ్రామాలకూ తారురోడ్లు
- ఆర్టీసీ బస్సులు మాత్రం తిరగవు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


ఉస్తినిపల్లికి వేసిన తారురోడ్డు

తనకల్లు: ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం. అయితే పల్లెవాసులకు ఆ అవకాశం లేకుండా పోతోంది. రూ.కోట్లు వెచ్చించి తారురోడ్లు వేసినప్పటికీ ఆ మార్గాల్లో ఆర్టీసీ బస్సులు మాత్రం తిరగడం లేదు. దీంతో విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, వివిధ వర్గాల ప్రజలకు ప్రైవేటు వాహనాలే దిక్కయ్యాయి. మండలంలో 60 గ్రామాల ప్రజలు వివిధ పనుల కోసం మండల కేంద్రం తనకల్లు, కదిరి, మొలకలచెరువు తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో తనకల్లు నుంచి మారుమూల గ్రామాలైన వెంకటరాయునిపల్లి, కొర్తికోట, సుబ్బరాయునిపల్లి, కొక్కంటి, సీఆర్ పల్లి, గుర్రంబైలు, మల్లిరెడ్డిపల్లి, పెద్దపల్లి, కోటపల్లి, చిన్నపల్లి, సీజీ ప్రాజెక్టు, బొంతలపల్లి, పూలకుంటపల్లి, టి.సదుం, మరాల్లపల్లి తదితర గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిపేవారు. కొన్నాళ్ల తర్వాత కలెక్షన్లు లేవని వాటిని రద్దు చేశారు. ప్రసుత్తం సీఆర్ పల్లి, కొక్కంటికి మాత్రమే బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. మల్లిరెడ్డిపల్లి, కోటపల్లి, పెద్దపల్లికి బస్సు సర్వీసులను నడపాలని ప్రజలు విన్నవించినా పట్టించుకునేవారు లేకపోయారు.

'ప్రైవేట్' ప్రయాణం.. భయం భయం

మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు గమ్యస్థానాలకు చేరుకోవాలంటే ప్రైవేటు వాహనాలే దిక్కు. అందులోనూ ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. విద్యార్థులు పాఠశాల, కళాశాలకు వెళ్లాలన్నా ఆటోల్లోనే ప్రయాణించాల్సి వస్తోంది. ఇది ఆర్థికంగాను తమకు ఇబ్బందిగా ఉందని వారంటున్నారు. ఆర్టీసీ బస్సులు నడిపితే తమకు రాయితీ పాసులు వచ్చి ప్రయాణ ఖర్చు తగ్గేదని అంటున్నారు. ఆటోల ద్వారా వెళ్లడం వల్ల నెలకు రూ.1,200 నుంచి రూ.1,500కు వెచ్చించాల్సి వస్తోందన్నారు.

ఆ రూట్లలో కలెక్షన్లు లేవు

కలెక్షన్లు లేకపోవడం వల్ల గతంలోనే ఆయా రూట్లలో నడుస్తున్న బస్సు సర్వీసులను రద్దు చేశారు. ఇప్పుడు ప్రతి గ్రామానికీ ఆటోలు ఉండడం వల్ల ప్రయాణికులు బస్సు ఎక్కడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో కలెక్షన్లు పడిపోవడంతో బస్సులను నడపలేకపోతున్నాం.
– మైనుద్దీన్, ఆర్టీసీ డిపో మేనేజర్, కదిరి

తనకల్లు రావడానికి ఇబ్బందులు పడుతున్నాం



మారుమూల గ్రామమైన రాచినేపల్లి నుంచి తనకల్లుకు బస్సు సర్వీసు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. గాండ్లపెంట మీదుగా కదిరికి వచ్చి అక్కడి నుంచి తనకల్లు మండల కేంద్రానికి రావాల్సి వస్తోంది. మా పల్లెల నుండి తనకల్లులోని ప్రభుత్వ కార్యాలయాలకు, ఇతర పనుల కోసం రావాలంటే ఆటోకు రూ.వందల్లో బాడుగ చెల్లించాలి. లేదా ద్విచక్ర వాహనాల్లో రావాలి. తనకల్లు నుంచి రాచినేపల్లి వరకు ఆర్టీసీ అధికారులు బస్సును నడిపితే చాలా గ్రామాల వారికి ఎంతగానో ఉపయోగంగా ఉంటుంది.
– రెడ్డెప్పనాయుడు, సర్పంచ్, రాచినేపల్లి

బస్సు సర్వీసు పునరుద్ధరించాలి



ఇదివరకు తనకల్లు నుంచి మా గ్రామాల మీదుగా కందుకూరు వరకు బస్సు సర్వీసు ఉండేది. ప్రస్తుతం ఆ సర్వీసు నిలిపివేయడంతో ఆటోలను ఆశ్రయిస్తున్నాం. నిత్యావసర సరుకులు, మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నాం. మా చుట్టుపక్కల ఉన్న దాదాపు 20కి పైగా గ్రామాలకు చెందిన విద్యార్థులు కళాశాలలకు వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకొని మా రూట్లో బస్సు సర్వీసు పునరుద్ధరించాలని కోరుతున్నాం.
– ప్రభాకర్‌నాయక్, బాబేనాయక్ తండా

ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో పోలీస్ టీం విజయం


పోలీస్ టీం, ప్రెస్‌క్లబ్ టీం సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం ధర్మవరం ప్రెస్‌క్లబ్ టీంతో జరిగిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో పోలీస్ టీం విజయం సాధించింది. ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌ను డీఎస్పీ శ్రీనివాస్, చేనేత ప్రముఖులు సందా రాఘవ, టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, పరిసే సుధాకర్, జింకా పురుషోత్తం ప్రారంభించారు. క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ధర్మవరం చేనేత క్రికెట్ టోర్నమెంట్ సందర్భంగా ఈ ఫ్రెండ్లీ మ్యాచ్ నిర్వహించారు. మొదట టాస్ గెలిచిన పోలీస్ టీం నిర్ణీత 14 ఓవర్లలో 154 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ధర్మవరం ప్రెస్‌క్లబ్ టీం 94 పరుగులు తీశారు. సీఐ నాగేంద్రప్రసాద్ అత్యధిక స్కోర్ చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నారు.

'చలో పార్లమెంట్ మార్చ్' జయప్రదం చేయండి


పోస్టర్లు విడుదల చేస్తున్న పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్ర

ధర్మవరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అధిక ధరలు తగ్గించాలని, పేదరికం నిర్మూలించాలని కోరుతూ ఆర్ఎస్‌పీ, పీఎస్‌యూ సంయుక్త ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టే 'చలో పార్లమెంట్ మార్చ్' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర పిలుపునిచ్చారు. కార్యక్రమ పోస్టర్లను బుధవారం ధర్మవరంలోని ఐటీఐ కళాశాలలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో మేకింగ్ ఇండియా.. మేడ్ ఇన్ ఇండియా అంటూ కేంద్రంలో అధికారంలోకి వచ్చి బీజేపీ ఏటా కోటి ఉద్యోగాలు కల్పించి పేదరికాన్ని నిర్మూలిస్తామని హామీ ఇచ్చిందని, పదేళ్లు పూర్తయినా ఉద్యోగ కల్పనకు చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పి లక్షలాది మంది ఉద్యోగులను రోడ్డున పడేసిందని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగసాయి, ఉదయ్, అభిషేక్, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు.. ప్రీమియం చెల్లింపు తప్పనిసరి

తాడిమర్రి: రైతులు పంటల బీమా పొందాలంటే ఈ-క్రాప్ నమోదు.. ప్రీమియం చెల్లింపు తప్పనిసరిగా చేయాలని వ్యవసాయాధికారి రమాదేవి తెలిపారు. బుధవారం ఆత్మకూరు గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ 2024–25 సంవత్సరం నుంచి రైతులు పంటల బీమా లబ్ధి పొందాలంటే నిర్దేశిత కాలంలో పంటలకు నిర్ణయించిన ప్రీమియం నగదు చెల్లించాలన్నారు. వాతావరణ బీమా ఆధారంగా టమాట పంటను, అలాగే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద వేరుశనగ, వరి పంటలను గుర్తించినట్లు పేర్కొన్నారు. టమాటకు ఎకరాకు రూ.1600, వేరుశనగకు రూ.480, వరికి రూ.630 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటనారాయణరెడ్డి, ఏఈఓ నిజాముద్దీన్, రైతులు శ్రీనివాసరెడ్డి, నరసింహారెడ్డి, పాల్గొన్నారు.

ఎన్పీకుంట: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి లోకేశ్వరరెడ్డి సూచించారు. ఎన్పీకుంట వ్యవసాయాధికారి కార్యాలయంలో బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ పంటలు సాగు చేసే ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ శిరీష, వీఏఏలు యుగంధర్, ఇంతియాజ్, రైతులు పాల్గొన్నారు.

టమాటకు వాతావరణ బీమా

గాండ్లపెంట: రబీలో అక్టోబర్ 15 నుంచి డిసెంబర్ 15 వరకు సాగు చేసే టమాట పంటకు వాతావరణ ఆధారిత బీమా వర్తిస్తుందని మండల ఉద్యానశాఖ అధికారి ఎస్.ప్రతాపరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎకరాకు రూ.1,600 చొప్పన బీమా ప్రీమియం చెల్లిస్తే పంట నష్టం జరిగినపుడు రూ.32 వేలు పరిహారం పొందవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఉద్యానవన శాఖ అధికారులను లేదా సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ధనుష్


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

ధర్మవరం అర్బన్: జాతీయ సమైక్యత శిబిరానికి కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ధనుష్ ఎంపికై నట్లు ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆ విద్యార్థిని బుధవారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న ధనుష్ గుజరాత్ రాష్ట్రం పటాన్‌లోనున్న హేమచంద్రాచార్య నార్త్ గుజరాత్ యూనివర్సిటీలో ఈ నెల 8 నుంచి 14 వరకు జరిగే జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొంటాడని తెలిపారు. దేశ సంస్కృతి, ఆచార, సంప్రదాయాలు, సాంస్కృతిక ప్రదర్శన కార్యకలాపాలు, యువకులు, విద్యార్థులకు అవగాహన, అభివృద్ధికి పాటుపడేలా భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాల మంత్రిత్వ, క్రీడాశాఖ జాతీయ సమైక్యత శిబిరంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోపాల్‌నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్ర పొలిటికల్ ఛైర్మన్‌గా పెనుజూరు


మాజీ మంత్రి టీజీ వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న పెనుజూరు నాగరాజు

ధర్మవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘంలో రాష్ట్ర పొలిటికల్ ఛైర్మన్‌గా ధర్మవరం మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ పెనుజూరు నాగరాజును ఎంపిక చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పొలిటికల్ ఛైర్మన్‌గా ఎంపిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య యువజన సంఘం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. తన ఎంపికకు కృషి చేసిన మాజీ మంత్రి టీజీ వెంకటేష్, ఏపీ ఆర్యవైశ్య యువజన సంఘం నేత శబరి వరప్రసాద్, ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లాల కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 24న అనంతపురంలోని కేటీఆర్ కన్వెన్షన్ హాల్‌లో నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందన్నారు. ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

నిరంతర సాధన చేయండి


ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో టీసీఎస్ మేనేజర్, 'సంస్కృతి' యాజమాన్యం

పుట్టపర్తి అర్బన్: విద్యార్థులు నిరంతర సాధనతో లక్ష్యాలను చేరుకోగలరని టీసీఎస్ సైబర్ సెక్యూరిటీ వర్క్ ఫోర్స్ మేనేజర్ శ్రీనివాస రామానుజం పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి సమీపంలోని సంస్కృతి విద్యా సంస్థల్లో నిర్వహించిన అనుబంధన్–2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన 'విద్యార్థులు–భవిష్యత్తు లక్ష్యాలు' అంశంపై సుదీర్ఘంగా ప్రసంగించారు. కార్పొరేట్ ప్రపంచంలో బలమైన కమ్యూనికేషన్, నైపుణ్యాలు, అవగాహన చాలా ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థీ నిత్యం ఏదో ఒక విషయాన్ని నేర్చుకుంటూ ఉండాలన్నారు. ముఖ్యంగా ఇంటర్న్‌షిప్ , పాఠ్యాంశాలతో పాటు ఇతర కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. పోటీ ప్రపంచంలో లక్ష్యాలను చేరుకోవడం విద్యార్థి ప్రతిభపైనే ఆధారపడి ఉంటుందన్నారు. సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సెంథిల్‌కుమార్, డీన్ డాక్టర్ బాలకోటేశ్వరి మాట్లాడుతూ 2024–25 సంవత్సరాల విద్యా షెడ్యూల్‌పై సంక్షిప్త నివేదికను వివరించారు. అనంతరం వివిధ పోటీలలో రాణించిన మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


బహుమతులు పొందిన విద్యార్థులతో హెచ్‌ఎం, బ్యాంక్ అధికారులు

గాండ్లపెంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో 'అవినీతి నిర్మూలన – సమాజ బాధ్యత' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి షిఫాఖానం, రెండవ బహుమతి శ్రవణ్, మూడవ బహుమతి సాయితేజకు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సిద్దారెడ్డి, బ్యాంక్ మేనేజర్ భరత్‌ప్రవీణ్, సహాయ మేనేజరు శ్రావణ్, ఉపాధ్యాయులు విశ్వనాథరెడ్డి, ముంతాజ్‌అలీ, రాజగోపాల్, గంగాధర, చిన్నప్పయ్య, పీడీలు హరిప్రసాద్, పాపారాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త కుండీల ఏర్పాటు..

సాక్షి ఎఫెక్ట్..


చెత్త కుండీలు ఏర్పాటు చేస్తున్న కార్మికులు

నల్లచెరువు: మండలంలో ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయిందని, చెత్త సేకరణ జరగడం లేదని 'సంపద సృష్టి ఉత్తిదే' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈఓఆర్డీ శకుంతల, సర్పంచ్ పంచరత్నమ్మ, కార్యదర్శి నరేష్ బుధవారం నల్లచెరువులోని పలు కాలనీల్లో పారిశుధ్య కార్మికులతో చెత్తకుండీలు ఏర్పాటు చేయించారు.

లాన్ టెన్నిస్ పోటీలకు పీఈటీ ఎంపిక


పోటీలకు ఎంపికైన పీఈటీ శివకృష్ణ

ధర్మవరం అర్బన్: ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఎంప్లాయిస్ లాన్ టెన్నిస్ పోటీలకు కేశాపురం జెడ్పీ హైస్కూల్ పీఈటీ శివకృష్ణ ఎంపికయ్యారు. విజయవాడలో బుధవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన టెన్నిస్ పోటీలలో ప్రతిభ చూపి రెండోస్థానం సాధించిన శివకృష్ణ ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఎంప్లాయిస్ లాన్ టెన్నిస్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యారు. శివకృష్ణను పట్టణ వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధ్యాయులకు విరివిగా రుణాలు ఇవ్వండి


ఏజీఎంను సన్మానిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: ఉపాధ్యాయులకు విరివిగా రుణాలు ఇవ్వాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఏజీఎం రమేశ్‌ను వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి తదితరులు కోరారు. వారు బుధవారం పుట్టపర్తి సాయి ఆరామంలో ఏజీఎంను కలిసి ఈ మేరకు ఒక వినతిపత్రం సమర్పించారు. అంతకుముందు మొదటి సారిగా జిల్లా కేంద్రానికి వచ్చిన రమేశ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌టీఏ నాయకులు సుబ్బారెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, చిదంబర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు 'జీవనజ్యోతి' విద్యార్థి


విద్యార్థి విక్కీని అభినందిస్తున్న హెచ్‌ఎం సుజాత

ధర్మవరం అర్బన్: నక్కపల్లిలో ఈ నెల ఎనిమిది నుంచి పదో తేదీ వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ధర్మవరం జీవనజ్యోతి పాఠశాల విద్యార్థి విక్కీ ఎంపికయ్యారని హెచ్‌ఎం సుజాత తెలిపారు. బుధవారం విద్యార్థిని పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ గత నెల 23న అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ హాకీ పోటీలలో విక్కీ ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి అండర్–14 హాకీ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా రాణించాలని హెచ్‌ఎం సుజాత, పీడీ వలి ఆకాంక్షించారు.

ఉపాధి పనులపై గ్రామసభలు

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా 14 గ్రామ పంచాయితీలలో బుధవారం ఉపాధిహామీ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టబోయే పనులను గ్రామసభలో వివరించారు. కార్యక్రమంలో ఈసీ సుబ్బారెడ్డి, ఏపీఓ మంజునాథ, క్షేత్ర సహాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విచారణ పేరిట తిప్పుతున్నారు!

కదిరి అర్బన్: ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టారన్న కారణంగా వీరచిన్నయ్యగారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త అమరనాథ్‌రెడ్డిని ఈ నెల 2న రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నాలుగో తేదీ బెయిలుపై విడుదల చేశారు. బుధవారం సెల్‌ఫోన్ తీసుకుపో అని అతడిని మరోసారి రూరల్ అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌కు సీఐ మోహన్ పిలిపించి విచారణ చేసినట్లు తెలిసింది. అతని బ్యాంకు, కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల వివరాలను సేకరిస్తున్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ విషయమై సీఐని వివరణ కోరగా తమ ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారన్నారు. ఒక స్టాండర్డ్ ఆపరేషన్ ఆఫ్ ప్రొసీజర్ మేరకు విచారణ జరుగుతోందని, తొందర్లోనే పంపించేస్తామని చెప్పారు.

ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండండి

ధర్మవరం రూరల్: గ్రామాల్లో ఫ్యాక్షనగొడవలకు దూరంగా ఉండాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. బుధవారం రాత్రి ఆయన తన సిబ్బందితో కలిసి ఫ్యాక్షన్ గ్రామమైన బడన్నపల్లిలో పర్యటించి గ్రామసభ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ చిన్న సమస్యలను పెద్దల సమక్షంలో గ్రామస్థాయిలోనే పరిష్కరించుకోవాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చెన్నేకొత్తపల్లి: మండల సరిహద్దులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో బుధవారం ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.6,120 నగదు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

రీసర్వే ఫిర్యాదులు వెంటనే పరిష్కరించండి

ధర్మవరం అర్బన్: భూముల రీసర్వేపై వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో వెళ్లి వెంటనే పరిష్కరించాలని డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి (డీఏఓ) ఖతిజున్‌కుబ్రా ఆదేశించారు. ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం తహసీల్దార్లు, సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టా సబ్ డివిజన్లు, ఎఫ్ లైన్స్, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీలు సర్వీస్ లెవెల్ అగ్రిమెంట్‌లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డివిజనల్ ఇన్‌స్పెక్టర్లు అంజలీదేవి, మురళీకృష్ణ, శామ్యూల్‌బాబు, మండల డిప్యూటీ సర్వేయర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

కంటి చూపు కాపాడుకోవాలి

కనగానపల్లి: ప్రతి ఒక్కరూ కంటి చూపును జాగ్రత్తగా కాపాడుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. కనగానపల్లిలోని కేజీబీవీ, మోడల్ స్కూళ్లలోని విద్యార్థులకు బుధవారం వైద్య సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ నరసమ్మ, కంటి వైద్య నిపుణులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయండి

ఎన్పీకుంట: మేకలచెరువు గ్రామపంచాయతీ కేంద్రంలో వీధి దీపాలు ఏర్పాటు చేయించాలని గ్రామస్తులు ఎంపీడీఓ ఆంజినప్పను కోరారు. ఎన్పీకుంటను కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో బుధవారం మండలంలోని 14 పంచాయతీలలో ఉపాధి సిబ్బంది గ్రామసభలు నిర్వహించారు. ఇందులో భాగంగా మేకలచెరువు గ్రామసభలో వీధిదీపాలు ఏర్పాటు చేయించాలని పలువురు కోరారు. అలాగే ఉపాధి హామీ పథకంలో చేపట్టబోయే పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మాధవరెడ్డి, ఏపీఓ చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ జేఈ రమేష్, టీఏలు పాల్గొన్నారు. అనంతరం సచివాలయాన్ని ఎంపీడీఓ తనిఖీ చేశారు.

బాల్య వివాహాలు అరికట్టడం అందరి బాధ్యత

తనకల్లు: గ్రామాల్లో బాల్య వివాహాల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ తెలిపారు. మల్లిరెడ్డిపల్లి సచివాలయంలో బుధవారం బాల్య వివాహాలపై సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

పుట్టపర్తి టౌన్: ఎస్పీ రత్న ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా బుధవారం సాయంత్రం పోలీసులు తనిఖీలు, గస్తీలు ముమ్మరం చేసి.. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపారు. ఆర్టీసీ బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, లాడ్జీలు, తనిఖీలు నిర్వహిస్తూ అనుమానాదస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.